క్లుప్తంగా

ఫారంపాండ్లతో రైతులకు అదనపు ఆదాయం



పనుల పరిశీలనలో అధికారులు

యాదమరి: ఫారం పాండ్ల నిర్మాణంతో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని ఏపీఓ సంధ్యారాణి చెప్పారు. ఆమె మండల పరిధిలోని మోర్దానపల్లి గ్రామంలో శుక్రవారం నిర్మించిన ఫారం పాండ్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సేద్యపు కుంటలతో సాగునీటి అవసరాలకే కాక భూగర్భ జలాల పెరుగుదలకు సహాయపడుతుందని తెలిపారు. పంటలకు నీరు అందించడానికే కాకుండా చేపల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని చెప్పారు. చేపల వ్యర్థంతో పంటలకు ఎరువులుగా ఉపయోగించవచ్చని అన్నారు. అంతేకాకుండా సేద్యపు కుంటల్లోని నీటిలో జలజీవరాసులు వృద్ధి చెంది తద్వారా పర్యావరణానికి మేలు చేస్తుందని తెలిపారు. మండలానికి దాదాపు 352 ఫారం పాండ్స్ మంజూరయ్యాయని, ఇప్పటికే 53 వరకు పనులు పూర్తయ్యాయని మరో 70 ఫారం పాండ్స్ వరకు నిర్మాణ దశలో ఉన్నట్లు చెప్పారు. ఫారం పాండ్స్ మీద ఆసక్తి గల రైతులు స్థానికంగా ఉన్న క్షేత్ర సహాయకులును గానీ లేదా ఎంపీడీవో కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు.

ఇంటివద్దకే వైద్యం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని 104 వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. మండలంలోని నంగమంగళం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలత, సరిత, వరలక్ష్మి, రూబి పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పనులు పరిశీలిస్తున్న ఏపీఓ బాల

తవణంపల్లె: ఎండల తీవ్రతవల్ల వడదెబ్బకు గురికాకుండా ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఈజీఎస్ ఏపీఓ బాల సూచించారు. మండలంలోని దిగువ మోదల పల్లె సమీపంలో ఆవలకొండలో కందకాల తవ్వుతున్న ఉపాధి కూలీల పనులను పరిశీలించారు. ఎంత మంది కూలీలు పనులు చేస్తున్నారని ఆరా తీశారు. యాప్‌లో ఎంత మంది కూలీలను అప్‌లోడ్ చేశారని ఫీల్డు అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఎండల్లో పనులు చేయరాదని వివరించారు. ఉదయం 10 గంటల్లోపు, సాయంత్ర 4 గంటలపైన పనులు చేపట్టాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులకు వెంటనే చెల్లించాలని కూలీలు ఏపీఓను కోరారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి దేవస్థానంలోని కల్యాణ వేదికలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌కు అత్యంత వైభవంగా పూజలు చేశారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి విశేష పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఉపన్యాసమిచ్చారు. కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, సిబ్బంది కోదండపాణి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

పలమనేరు: పట్టణంలో నిర్వహిస్తున్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా గంగచాటు రెండోరోజైన శుక్రవారం స్థానిక గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారికి పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

8న కుంభాభిషేకం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని అలుకూరుపల్లి గ్రామంలో ఈనెల 8, 9వ తేదీల్లో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిర మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8న హోమపూజలు, 9న శిఖరగోపుర మహా కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ట ఉంటుందని చెప్పారు.

గాలీవాన బీభత్సం



గుడిపాల: విరిగిన విద్యుత్ స్తంభం



చిత్తూరు మండలంలో కూలిన మామిడి చెట్టు

చిత్తూరు: నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



గుడిపాల: నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంతోపాటు మండలంలో శుక్రవారం గాలీవాన బీభత్సాన్ని సృష్టించింది. మధ్యాహ్నం వరకు నగరంలో ఎండలు మండిపోయాయి. ఉన్నఫలంగా సాయంత్రం 4 గంటల సమయంలో వాతావరణం చల్లబడి, 15 నిమిషాల పాటు వచ్చిన గాలీ వాన అల్లకల్లోలం సృష్టించింది. దీనికి తోడు వడగళ్లతో కూడిన వర్షం కురవడంతో నగర వాసులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగింది. ఇక పలు కాలువల్లో మురుగునీళ్లంతా రోడ్లపైకి, నివాస ప్రాంతాల్లోకి రావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలో శుక్రవారం సాయంత్రం వీసిన ఈదురుగాలుల ప్రభావంతో వరిపంట, అరటిచెట్లన్నీ నేలకూలాయి. రోడ్లపైన చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఎక్కడికక్కడ విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. చీలాపల్లె సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. విద్యుత్ స్తంభాలు, తీగలు ధ్వంసమయ్యాయి. పిళ్లారికుప్పం, పాపసముద్రం, చిత్తపార, బండపల్లె, అడవిచేను గ్రామాల్లో అరటి పంట అధికంగా సాగుచేస్తున్నారు. ఇక్కడ అరటి పంట నేల కొరిగింది. దీంతో పాటు వరిపంట కూడా నేలకొరగడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. గ్రామాల్లో విద్యుత్ లేకపోవడంతో గ్రామస్తులు అంధకారంలోనే ఉన్నారు.



తాళంబేడులో రాలిన మామిడికాయలు



గుడిపాల: రోడ్డుపై విరిగి పడిన చెట్లు

రైతులకు సాంకేతికతపై అవగాహన అవసరం





గుడిపాల: అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు, యాదమరి: మాట్లాడుతున్న అధికారులు

గుడిపాల: ప్రతి రైతు ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగి ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ, వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మండలంలోని చిత్తపార, కుప్పిగానిపల్లె సచివాలయాల్లో శుక్రవారం రైతులకు స్కిల్ అప్ చిత్తూరు, డిజిటల్ ట్రైనింగ్‌ను నిర్వహించారు. వారు రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగించి సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ యాప్‌లు, డిజిటల్ పేమెంట్స్, యూట్యూబ్ చానల్స్ నిర్వహణ, వాతావరణం, మార్కెట్ ధరల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సంబంధించిన మొబైల్‌లో వ్యవసాయానికి సంబంధించిన యాప్‌లను డౌన్‌లోడింగ్ చేయించారు. ఇకపై రైతులకు కావలసిన వివరాలన్నింటినీ యాప్‌లోనే చూసుకునేలా వారికి విపులంగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది తులసీరాంరెడ్డి, సోనియా, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక రాబడి

యాదమరి: రైతులు అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయం చేయడం వలన అధిక రాబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి చరిత తెలిపారు. ఆమె మండలంలోని జంగాలపల్లి, 12కమ్మపల్లి రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలోని వివిధ రకాలైన స్మార్ట్ ఫోన్ యాప్స్, డిజిటల్ చెల్లింపుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు వాతావరణ స్థితిగతులు, వివిధ మార్కెట్లలో పంటల యొక్క ధరలు తెలుసుకోవచ్చని చెప్పారు. తద్వారా రైతులు తమ పంటలను తమకు గిట్టుబాటు ధర వచ్చే మార్కెట్లలో విక్రయించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమములో శిక్షణ అధికారులు సాయి సింహారెడ్డి, అనిత, పర్యవేక్షణాధికారి ఢిల్లీ ప్రసాద్, భవాని, రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఉద్యమ పితామహుడు దాచూరి

ఐరాల: యూటీఎఫ్ ఉద్యమ పితామహుడు, ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు దాచూరి రామిరెడ్డి అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. దాచురి రామిరెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకుని మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ దాచురి యూటీఎఫ్‌కు చేసిన సేవలను, కృషిని కొనియాడారు. కుటుంబ జీవితాన్ని సైతం లెక్క చేయకుండా యూటీఎఫ్‌కు ఎనలేని సేవలని అందించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా 1981 నుంచి 2000 మధ్య సేవలందించారన్నారు. ఆయనను నేటి ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ యూటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, జగన్నాథంనాయుడు, మండల యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి అరుణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులు జనార్దన్, అమ్ములు, మహిళా కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.



దాచూరికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

ద్రౌపదీ ఆలయ కుంభాభిషేక మహోత్సవం





హోమం చేస్తున్న వేద పండితులు, నవగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన 972 కలశాలు

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన ద్రౌపదీ సమేత ధర్మరాజులు, మునేశ్వరుల కుంభాభిషేకాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహా గణపతి, మహాలక్ష్మి, నవగ్రహం, సుదర్శన హోమం, గోపూజ, ధన పూజ, పూర్ణాహుతి, నవగ్రహాలప్రతిష్టను వేదపండితుల శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొమ్మిది నవగ్రహాల వద్ద 972 కలశములను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం, రాత్రి కోలాటాలు నిర్వహించారు.

లక్ష్యం దిశగా పయనించాలి

యాదమరి: కిశోర బాలికలు ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా పయనిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటాయని సీడీపీఓ వాణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని జంగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి బాలికల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు భవిష్యత్తు తరానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, సర్పంచ్ రమేష్ బాబు, అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి, గ్రామీణ వైద్యాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గురుకులం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

బంగారుపాళెం: స్థానిక గిరిజన గురుకుల(బాలుర)పాఠశాలలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకట సుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి 3 నుంచి 9వ తరగతి వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 3వ తరగతిలో ఎస్టీలు–32 మంది, ఎస్సీలు–5, బీసీలు–2 ఓసీ ఒక్కటి ఖాళీగా ఉన్నాయన్నారు. బ్యాక్‌లాగ్ ఖాళీలు ఎస్టీ విద్యార్థులచే భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

బ్యాక్‌లాగ్ ఖాళీలు: 4వ తరగతిలో 38, 5వ తరగతిలో 34, 6వ తరగతిలో 32, 7వ తరగతిలో 16, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 16 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం ఉండాలన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ లోపు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99894 68202ను సంప్రదించాలని కోరారు.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి



మద్దతు తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: సీహెచ్‌ఓల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేస్తున్న శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపి మాట్లాడారు. గత 5 రోజులుగా సమ్మె చేస్తున్న వారిపై ప్రభుత్వం కనికరం చూపకపోవడం బాధకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా తమ యూనియన్ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఆర్గానిక్ ఉత్పత్తుల విక్రయంపై అవగాహన



మాట్లాడుతున్న ఫైనాన్స్ డీపీఎం రఘుకుమార్

తవణంపల్లె: రైతు సంఘాల సభ్యులకు ఆర్గానిక్ ఉత్పత్తులు, కూరగాయల విక్రయంపై అవగాహన ఉండాలని ఫైనాన్స్ డీపీఎం రఘుకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రైతు సంఘాల సమావేశం నిర్వహించారు. రఘుకుమార్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, సార్వత్రిక, సప్త సూత్రాలు, కిచెన్ గార్డెన్స్, చిరుధాన్యాల సాగు గురించి వివరించారు. మార్కెటింగ్ గురించి పైలట్ గ్రామం కింద రైతులకు ఆటో మొబైల్ వ్యాను ద్వారా ఆర్గానిక్ ఉత్పత్తులు, కూరగాయల విక్రయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎం యూనిట్ అధికారి మధు, రమణ, వెలుగు ఏపీఎం రవి, సిబ్బంది సరిత, హరిత, పల్లవి, లీలావతి, అనురాధ, రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా జలకంఠేశ్వరుని కల్యాణోత్సవం





విశేషాలంకారంలో పార్వతీదేవి జలకంఠేశ్వరస్వామి, కల్యాణోత్సవంలో వేద పండితులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిదేవరకొండపై శుక్రవారం రాత్రి శ్రీపార్వతీదేవి సమేత జలకంఠేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధారణ, నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నూతన విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. పార్వతీదేవి సమేత జలకంఠేశ్వరస్వామి మూలవర్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి, స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్వామి, అమవారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

యాదమరి: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు మండల అనుబంధ కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మండల వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ అధ్యక్షులుగా నవీన్ కుమార్, మహిళా విభాగం రూపవతి, రైతు విభాగం నాగేశ్వర్ రెడ్డి, బీసీ సెల్‌కు జగన్నాథం, ఎస్సీ సెల్‌కు సెల్వం, ఎస్టీ సెల్‌కు ఎర్రయ్య, మైనారిటీ సెల్‌కు మహమ్మద్ ఇలియాజ్, స్టూడెంట్ విభాగం ప్రకాష్, లీగల్ సెల్‌కు సుధాకర్ యాదవ్, వైఎస్సార్‌టీయూసీకి పరంధామన్, ఐటీకి వంశీ, గ్రీవెన్స్ సెల్‌కు కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ విభాగం రమేష్, వలంటీర్లకు గోపి యాదవ్, దివ్యాంగులకు చంద్రశేఖర్ యాదవ్, కల్చరల్‌కు నాగరాజ్, ఆర్టీఐకి పవన్ కుమార్ రెడ్డి, వాణిజ్య విభాగానికి మేఘనాథ్, డాక్టర్స్ విభాగం మనోజ్ కుమార్, ఇంటలెక్చువల్ విభాగానికి రెడ్డి ప్రసాద్, సోషల్ మీడియా విభాగానికి గజేంద్ర, బూత్ కమిటీ విభాగానికి దొరబాబు, పబ్లిసిటీకి ప్రభాకర్ నియమితులయ్యారు.

బంగారుపాళెం మండల కమిటీ

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ విభాగాల కమిటీ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. మండల యూత్ విభాగానికి అధ్యక్షులుగా గజేంద్ర, మహిళా విభాగం అధ్యక్షురాలుగా వాణిప్రియ, రైతు విభాగం అధ్యక్షులుగా అరుణామల్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులుగా మొగిలీశ్వర, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా నాగరాజ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలుగా మాలతి, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా షాకీర్, వైఎస్సార్‌టీయూ అధ్యక్షులుగా రియాజ్, ఐటీ అధ్యక్షులుగా సుధీర్‌రెడ్డి, పంచాయతీ విభాగం అధ్యక్షులుగా సుబ్రమణ్యం, వలంటీర్స్‌కు సుదర్శన్, ఆర్‌టిఐకి అధ్యక్షులుగా సురేంద్ర, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా విజయకుమార్‌రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులుగా యోహాన్, డాక్టర్స్ వింగ్ అధ్యక్షులుగా డాక్టర్ జగదీష్, సోషియల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా శైలేష్ బాబు, బూత్‌కమిటీ అధ్యక్షులుగా భానుప్రకాష్‌రెడ్డి, మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా పాల్‌రాజ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కిశోరి వికాసంతో ఉజ్వల భవిష్యత్

గుడిపాల: యుక్త వయసులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం ఎంతగానో దోహద పడుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సర్వలత, ఏఎన్ఎం జబసెల్వి తదితరులు అన్నారు. వేసవి సెలవుల్లో భాగంగా శుక్రవారం కిషోరి బాలికలకు తిమ్మాపల్లె, వసంతాపురంలో వారు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాల బాలికల్లో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి తెలపడంతోపాటు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వారికి విపులంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, లక్ష్మి, ఆశావర్కర్లు సుజిమ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఐరాల: కిశోరి వికాసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం



తిమ్మాపల్లెలో మాట్లాడుతున్న స్వర్ణలత

బాలికల ఉజ్వల భవితకు కిశోరి వికాసం

ఐరాల: బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లె సచివాలయంలో మహిళా పోలీస్ భవ్యరెడ్డి ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, బాలికల తల్లులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్తవయసులో బాలికలకు రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం కిశోరి వికాసం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఎస్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వసంతాపురంలో కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న జబసెల్వి



ఐరాల: బాలికలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ వసంత


తాళంబేడులో కిశోరి వికాసం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని తల్లిదండ్రులు, బాలికలకు సచివాలయం, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది వివరించారు. 12 నుంచి18 ఏళ్ల వయసు గల బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాల్య వివాహాల నివారణ, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, ఆత్మరక్షణ, వృత్తి, విద్య, ఉపాధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యలు వస్తే నిర్భయంగా పోలీసులు తెలియపరచవచ్చని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, సచివాలయ సిబ్బంది సహిష్ట తదితరులున్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ఐరాల: కిశోరి వికాసంపై గ్రామ స్థాయిలో బాలికలకు అవగాహన కల్పించాలని పొలకల సర్పంచ్ వసంత సూచించారు. శుక్రవారం పొలకల సచివాలయంలో మహిళా పోలీసులు శ్వేత, వాణి ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలకు ఆరోగ్యం, పోషణ, రక్షణ, విద్య సాధికారత జీవిత నైపుణ్యాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సురేంద్ర నాయుడు, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కరణం సంక్షేమ సంఘం అధ్యక్షుడి మృతి



భాస్కర్‌పిళ్లై (ఫైల్)

బంగారుపాళెం: కరణం సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు భాస్కర్‌పిళ్లై శుక్రవారం మృతి చెందారు. మండలంలోని తగ్గువారిపల్లెకు చెందిన భాస్కర్‌పిళ్లై గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తిరుపతిలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండలంలోని జంబువారిపల్లెలో పోస్టుమన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. భాస్కర్‌పిళ్లై మృతి పట్ల పలువురు పోస్టల్ సిబ్బంది, కరణం సంక్షేమ సంఘం సభ్యులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.